సాక్షి
పెద్దపల్లి
బుధవారం । 17 । సెప్టెంబర్ । 2025



సోలార్ పవర్ ప్లాంట్ తనిఖీ

రామగిరి: 50 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను సెక్యూరిటీ జీఎం లక్ష్మీనారాయణ మంగళవారం పరిశీలించారు. రక్షణ చర్యల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.



దంచికొట్టిన వాన

ఓదెల: ఓదెల, పొత్కపల్లి, గుంపుల, శానగొండ, కొలనూర్, గోపరపల్లె, ఉప్పరపల్లె గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం వర్షం దంచికొట్టింది. సుమారు గంటన్నర పాటు వర్షం కురిసింది.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం అధికంగా నమోదు అవుతుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

తలవంచిన నిరంకుశత్వం

- నైజామోన్ని తరిమిన గడ్డ కరీంనగర్
- తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో ప్రముఖపాత్ర
- నేలకొరిగిన వందలాది మంది యోధులు
- సెప్టెంబర్ 17 సందర్భంగా స్పెషల్ స్టోరీ



హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గుట్టల్లో తొలిసాయిధ దళం ఎన్‌కౌంటర్‌కు గురైన ప్రాంతం (ఫైల్)





ఉద్యమించిన సాయుధ దళం(ఫైల్)

బాంచెన్ కాల్మొక్త అన్న సామాన్యులే.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం బందుకూతో గడి పునాదులను పెకిలించారు.. నిజాం నిరంకుశ పాలనలో మగ్గిపోతున్న తెలంగాణ ప్రజల విముక్తి కోసం కదంతొక్కారు.. జాగిరీదారులు, మక్తేదారులు, ఇనాందారులు, వతన్‌దారుల దుర్మార్గాలు, దౌర్జన్యాలపై పోరాటం సాగించారు..ఎందరో రజాకార్లను తరిమికొట్టారు.. తెలంగాణ సాయుధ పోరాటంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కీలక పాత్ర పోషించింది. అందులో ఇప్పటి రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రాంతం మడమతిప్పని పోరాటం సాగించింది.. బానిస సంకెళ్ల విముక్తి కోసం ఎందరో తమ ప్రాణాలను తృణప్రాయంగా వదిలారు. నేడు సెప్టెంబర్ 17 సందర్భంగా పలువురు యోధుల కథనాలు.

– పెద్దపల్లి రూరల్/మంథని రూరల్/కరీంనగర్/సిరిసిల్ల/ఇల్లంతకుంట/బోయినపల్లి

- వివరాలు 8లో ▸

న్యూస్‌రీల్

నేటి నుంచి వైద్యశిబిరాలు



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: మహిళల ఆరోగ్యం కోసం ఈ నెల 17 నుంచి ప్రత్యేక వైద్యశిబిరాలను నిర్వహించాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీతో కలిసి స్వస్థ్ నారీ స్వశక్తి అభియాన్ పథకం అమలుపై సమీక్షించారు. బుధవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. బాలికల స్కూళ్లు, కాలేజీల్లోనూ ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించాలన్నారు. డయాబెటిస్, బ్రెస్ట్‌క్యాన్సర్, హైపర్ టెన్షన్, సర్వికల్ క్యాన్సర్, ఎనీమియా, టీబీ లాంటి వ్యాధుల నిర్ధారణకు పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. డీఎంహెచ్‌వో వాణిశ్రీ, డీపీవో వీరబుచ్చయ్య, డీఈవో మాధవి, డీడబ్ల్యూవో వేణుగోపాల్ పాల్గొన్నారు.

'ఎల్లంపల్లి'కి భారీ ఇన్‌ఫ్లో



గోదావరిలోకి ఉరకలేస్తున్న వరదనీరు

రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో భారీగా వచ్చి చేరుతోంది. దీంతో మంగళవారం ప్రాజెక్టు 38 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 19.20 టీఎంసీలు ఉందని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టులోకి 4.60 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని, దిగువన ఉన్న గోదావరి నదిలోకి 4.91 లక్షల క్యూసెక్కులు విడుదల చేస్తున్నామన్నారు. ఎస్సారెస్పీ నుంచి అత్యధికంగా 2.32 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని వారు వివరించారు.

పోలీస్ స్పోర్ట్స్ మీట్‌కు ఎంపిక



శ్రీలతను అభినందిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

కమాన్‌పూర్(మంథని): పోలీస్ కానిస్టేబుల్ కూరపాటి శ్రీలత ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో యోగా పోటీలకు ఎంపికయ్యారు. ఇందుకోసం పోలీస్ అకాడమీలో శిక్షణ తీసుకునేందుకు వెళ్తున్నారు. ఆమెను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐ శ్రీనివాస్ మంగళవారం అభినందించారు. ఆంధ్రప్రదేశ్‌లో అక్టోబర్ 13 నుంచి 17వ తేదీ వరకు ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నారు.


యూరియా అందించాలి



మాట్లాడుతున్న నాయకులు

రామగుండం: అన్నదాతలకు సరిపడా యూరియా అందజేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు ఎం.చంద్రయ్య డిమాండ్ చేశారు. అంతర్గాం మండలం పెద్దంపేటలోని రైతు కూలీ సంఘం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇవ్వాల్సి ఉండగా.. 5.30 లక్షల మెట్రిక్ టన్నులే ఇవ్వడంతోనే కొరత ఏర్పడిందని విమర్శించారు. యూరియా కొరత తీర్చాలని, భారీవర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేల పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు ఇ.నరేశ్, కొల్లూరి మల్లేశ్, ఎడ్ల రవికుమార్, బోనాల లింగయ్య, తూళ్ల లింగయ్య, ఆరుముళ్ల శంకర్, గట్టయ్య తదితరులు ఉన్నారు.

నియామకం



నియామకపత్రంతో అంజన్‌కుమార్

జ్యోతినగర్(రామగుండం): తెలంగాణ నేషనల్ గ్రీన్‌కార్ప్స్ పర్యావరణ విద్య జిల్లా బ్రాండ్ అంబాసిడర్‌గా అంజన్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు ఎన్‌జీసీ డైరెక్టర్ ప్రసన్నకుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఎన్టీపీసీ జెడ్పీ హైస్కూల్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయుడు గూళ్ల అంజన్‌కుమార్.. పర్యావరణ పరిరక్షణ, స్థిరత్వం, విద్యపై నిబద్ధత గురించి యువతకు అవగాహన కల్పించాలని, పర్యావరణ పరిరక్షణ కోసం సమష్టి చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విస్తరిస్తున్న క్షయ!

- మధ్యలో మందులు మానేస్తున్న పేషెంట్లు
- చిన్న పిల్లల్లోనూ బయటపడుతున్న వ్యాధి లక్షణాలు



క్షయపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, సిబ్బంది

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో క్షయ చాపకింద నీరులా విస్తరిస్తోంది. వయోవృద్ధుల నుంచి చిన్నపిల్లల వరకూ వ్యాధి బారిన పడుతున్నారు. గతంలో 50 ఏళ్లకు పైబడిన వారే టీబీ బారిన పడుతుండే వారు. మారుతున్న జీవన విధానం, తగ్గుతున్న వ్యాధి నిరోధకశక్తితో కొన్నేళ్లుగా చిన్నారులు కూడా క్షయ పీడితులవుతున్నారు. బాధితుల్లో కొంతమంది మధ్యలో చికిత్స ఆపేస్తుండడంతో వ్యాధి మళ్లీ తిరగబెడుతోందంటున్నారు. తర్వాత ముదిరి మొండిగా మారి ప్రాణాలు తీస్తోంది. క్షయ నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నా పూర్తిస్థాయిలో నిరోధించలేకపోతున్నాయి.

క్షయబారిన 87 మంది చిన్నారులు

జిల్లాలో గత నాలుగేళ్లలో 4,805 మంది క్షయ బారినపడగా, అందులో 87 మంది చిన్నారులు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. శిశువు పుట్టిన 24 గంటల్లోపు క్షయను నివారించే బీసీజీ టీకా ఇస్తారు. లేదా పుట్టిన రెండేళ్లలోపు ఎప్పుడైనా టీకా ఇప్పించవచ్చు. పుట్టే శిశువుల్లో దాదాపు 99 శాతం మందికి బీసీజీ ఇస్తున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతుండగా.. క్షయ బాధిత పిల్లలు ఇంకా ఉండడమేమిటన్నది జవాబులేని ప్రశ్నగా మారింది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులతోపాటు ఇళ్లవద్ద కాన్పు జరిగిన శిశువులకు కచ్చితంగా బీసీజీ టీకా అందించేలా సర్కార్ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

చాపకింద నీరులా..

జిల్లాలో క్షయ నిర్మూలన కోసం అధికారులు క్షేత్రస్థాయిలో క్రమం తప్పకుండా వైద్యశిబిరాలు నిర్వహిస్తూ వ్యాధిగ్రస్తులను గుర్తించి, చికిత్స అందిస్తున్నారు. అయినా కేసులు తగ్గుముఖం పట్టడం లేదు. వేళకు మందులు వేసుకోవడం, పౌష్టికాహారం తీసుకోవడం, డాక్టర్ల సూచనల మేరకు నడక, వ్యాయామం చేయడం వంటివి క్రమం తప్పకుండా చేసిన వారు చాలావరకు ఆరోగ్యవంతులుగా మారుతున్నారు. మరికొందరు రెండు, మూడు నెలల్లో వ్యాధి లక్షణాలు తగ్గగానే మందులు మానేస్తున్నారు. దీంతో చాలామందిలో వ్యాధి తిరగబెడుతోంది. తీవ్రత ఆధారంగా డ్రగ్ సెన్సిటివ్ టీబీ, డ్రగ్ రెసిస్టెంట్ టీబీగా విభజించారు. డ్రగ్ సెన్సిటివ్ టీబీకి ఆరునెలల పాటు చికిత్స తీసుకోవాల్సి ఉండగా, డ్రగ్ రెసిస్టెంట్ టీబీకి వ్యాధి తీవ్రత ఆధారంగా ఆరు నెలల నుంచి 18 నెలల వరకు చికిత్స తీసుకోవాల్సి ఉంటుందని వైద్యనిపుణులు చెబుతున్నారు.

వ్యాధి లక్షణాలివే..

క్షయ ఒక అంటువ్యాధి. పేషెంట్ దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు క్రిములు ఇతరులకు వ్యాపిస్తాయి. ఎవరికైనా వ్యాధి సోకితే రెండువారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు, ఆకలి తగ్గదల ఉంటుంది. దగ్గినప్పుడు క్రిములు గాలి ద్వారా వ్యాపిస్తాయి. ఉమ్మినప్పుడు రక్తం పడటం వంటి లక్షణాలు గుర్తిస్తే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో సంప్రదించాలి.

పిల్లల్లో లక్షణాలు

పెద్దల్లో మాదిరిగా తీవ్రదగ్గు ఉండదు. ఆకలి తగ్గిపోతుంది. అన్నం తినాలని బలవంతం చేస్తే ఏడుస్తారు. పిల్లల్లో వయస్సుకు తగ్గట్లుగా ఎదుగుదల ఉండదు. బరువు పెరగరు. సాయంత్రం వేళల్లో జ్వరం వస్తుంది. మెడ పక్కన లింపు గ్రంథుల్లో వాపు, గడ్డల్లాగా వస్తుంది. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

జిల్లా సమాచారం

ఏడాది	2022	2020	2024	2025 (ఇప్పటివరకు)
టెస్టులు	23,880	23,694	22,956	14,670
కేసులు	1,291	1,426	1,246	842
15ఏళ్లలోపు	32	29	13	13
మరణాలు	73	41	43	12


సకాలంలో గుర్తించాలి

క్షయ అనుమానితులకు ఎప్పటికప్పుడు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం. మందుల పంపిణీతోపాటు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. వ్యాధి వ్యాప్తిని అడ్డుకునేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం. బాధితులు త్వరగా రికవరీ అవుతున్నారు. క్షయను సకాలంలో గుర్తించి క్రమంగా మందులు వాడితే తప్పకుండా అదుపులోకి వస్తుంది.

– సుధాకర్‌రెడ్డి, జిల్లా క్షయ నివారణ అధికారి

చేయిపట్టి చూడరు.. ఆపరేషన్ చేయరు!

- ఇయ్యాల్టి నుంచి ఆరోగ్యశ్రీ సేవలు బంద్
- ఉమ్మడి జిల్లాలో నెట్‌వర్క్ నిలిపివేత
- బోధనాసుపత్రులు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో యథావిధిగా సేవలు



కరీంనగర్‌టౌన్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆరోగ్యశ్రీ సేవలు బుధవారం నుంచి పూర్తిస్థాయిలో నిలిచిపోనున్నాయి. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం కారణంగానే సేవలు నిలిపివేస్తున్నట్లు ఆసుపత్రుల యాజమాన్యాలు ప్రకటించాయి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పుణ్యమా అని 17 సంవత్సరాలుగా నిరుపేద, మధ్య తరగతి ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందుతుండగా.. ఈ ఏడాదిలోనే జనవరిలో ఒకసారి సేవలు నిలిపివేశారు. అయినప్పటికీ బిల్లుల పంచాయితీ తేలకపోవడంతో మరోమారు సేవల నిలిపివేతకు నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు నిర్ణయం తీసుకున్నాయి. దీంతో పేషెంట్లు తీవ్ర ఇబ్బందులు పడనున్నారు. రోడ్డు ప్రమాదాలు, గుండె సమస్యలు, అపెండిసైటిస లాంటి అత్యవసర సేవలకు తీవ్ర అవస్థలుపడే పరిస్థితి ఏర్పడనుంది. గతంలో ఈ పథకం కింద ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేసి పేదలకు ఉచితంగా ఓపీ, రక్తపరీక్షలు, ఆపరేషన్లు నిర్వహించే వారు. ఇందుకోసం ప్రభుత్వం నిర్ణయించిన ఫీజును నేరుగా ఆసుపత్రుల ఖాతాల్లోకే జమచేసేవారు. కొంత కాలంగా బకాయిలు పెరిగిపోవడంతో నిర్వహణ భారమైన ఆసుపత్రులు ఈ నిర్ణయం తీసుకోవడంతో వైద్యం నిరుపేదలకు అందని ద్రాక్షగా మారనుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 49 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు ఉండగా, అందులో 32 ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ, ప్రైవేటు బోధనాసుపత్రులు, కార్పొరేట్ ఆసుపత్రులైన అపోలో రీచ్, మెడికవర్ మినహా అన్ని ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేయనున్నాయి. దీంతో పేషెంట్లు ప్రైవేటు బోధనాసుపత్రులకు పరుగులు తీసే అవకాశం ఉంది. ఆసుపత్రులన్నీ ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడంతో ప్రైవేటు బోధనాసుపత్రులకు, కార్పొరేట్ ఆసుపత్రులకు పేషెంట్ల తాకిడి పెరగనుంది. ఉమ్మడి జిల్లాలో ప్రతీరోజు సుమారు 70 మందికిపైగా ఆరోగ్యశ్రీ పథకం కింద ఆసుపత్రులలో చికిత్స పొందేవారు. సేవలు నిలిపివేస్తుండడంతో ప్రభుత్వ తీరు, ఆసుపత్రుల వ్యవహారశైలిపై పేషెంట్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఆరోగ్యశ్రీ నిలిపివేయడం బాధాకరం



నిరుపేదలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించేందుకు ప్రారంభించిన ఆరోగ్యశ్రీ పథకం నిలిపివేయడం బాధాకరం. డబ్బులు చెల్లించి వైద్యం చేయించుకోలేని నిరుపేదలు చాలా ఇబ్బంది పడతారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. బకాయిలను కూడా విడుదల చేసి ఆస్పత్రులకు చేయూత ఇవ్వాలి.

– బి.రాజాకిషన్‌గౌడ్, కరీంనగర్

బకాయిల భారం పెరగడంతోనే..



ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్న ఆసుపత్రులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు పెరిగిపోయాయి. నిర్వహణ భారంగా మారింది. వేతనాలు, మెయింటెనెన్స్ కష్టంగా మారడంతోనే ఉమ్మడి జిల్లా ఆసుపత్రుల యాజమాన్యాలు సమష్టిగా ఆలోచన చేసి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేసే నిర్ణయం తీసుకున్నాం.

– విష్ణువర్ధన్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల అధ్యక్షుడు, ఉమ్మడి జిల్లా

'పుట్ట' ఇంటి ఎదుట కాంగ్రెస్ ధర్నా

- శ్రీపాదరావు, శ్రీధర్‌బాబుపై వ్యాఖ్యలకు నిరసన



మధు ఇంటి ఎదుట బైఠాయించిన కాంగ్రెస్ శ్రేణులు

మంథని: మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఇంటి ఎదుట కాంగ్రెస్ నాయకులు మంగళవారం ధర్నా చేశారు. దివంగత మాజీ స్పీకర్ శ్రీపాదరావు, మంత్రి శ్రీధర్‌బాబుపై పుట్ట మధు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళనకు దిగారు. రాజకీయ భిక్ష పెట్టిన శ్రీపాదరావుపై వ్యాఖ్యలు చేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుద్దిళ్ల కుటుంబానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ సమయంలో మధు ఇంట్లో లేరు. ఆయన భార్య, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పుట్ట శైలజ ఇంట్లో బయటకు వచ్చి మాట్లాడారు. రెండు గంటలకుపైగా తన ఇంటిఎదుట ధర్నా చేస్తుంటే పోలీసులు చూస్తూ ఊరుకుంటారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులే దగ్గరుండి ధర్నా చేయిస్తారా? అని ప్రశ్నించారు. ఈ క్రమంలో స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు బీఆర్‌ఎస్ శ్రేణులను అక్కడినుంచి పంపించి వేశారు. అనంతరం అంబేద్కర్, శ్రీపాదరావు విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. కాసేపటి తర్వాత పుట్ట మధు స్థానిక ప్రధాన చౌరస్తాలోని ఓ దుకాణంలో కూర్చున్నారు. బీఆర్‌ఎస్ శ్రేణులు నిరసన తెలుపుతారేమోననే అనుమానంతో ప్రధాన చౌరస్తాతో పాటు ప్రధాన కూడళ్లలో పోలీసులు భారీగా మోహరించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్, విద్యుత్ నియంత్రణ మండల సలహా కమిటీ సభ్యుడు శశిభూషణ్ కాచే, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, నాయకులు ఎరుకల ప్రవీణ్, కొండ శంకర్, ఆరెల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ తప్పా?

కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేటలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం పుట్ట మధు చేసిన తప్పా? అని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పుట్ట శైలజ ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడవక ముందే దాడులకు దిగుతారా? అని నిలదీశారు. కాంగ్రెస్ నాయకులు తమ ఇంటిపై దాడికి పూనుకున్నారని పుట్ట శైలజ ఎస్సైకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పుట్ట మధును చంపడానికి ప్రయత్నించారని అందులో పేర్కొన్నారు.

ప్రభుత్వమే నిర్వహించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి సదానందం



నినాదాలు చేస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను ప్రభుత్వమే నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు గౌతం గోవర్ధన్‌తో కలిసి మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను భావితరాలకు తెలిసేలా పాఠ్యపుస్తకాల్లో సిలబస్ చేర్చాలన్నారు. నిజాం నిరంకుశ పాలనకు చరమ గీతం పాడేందుకు నాయకులు రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్ ఇచ్చిన పిలుపు మేరకు వీరోచితంగా పోరాడి అనేకమంది అమరులయ్యారని అన్నారు. పూసాల రమేశ్, మానస్, నవీన్, ఉదయ్, అంజి, సదానందం, శంకర్, తిరుమల్, ఎల్లయ్య, రాజేశ్ ఉన్నారు.

ప్రజల మన్ననలు పొందేలా సేవలు ఉండాలి

- కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తూ వారి మన్ననలు పొందాలని కలెక్టర్ శ్రీహర్ష సూచించారు. గ్రామ పరిపాలనాధికారులుగా బాధ్యతలు స్వీకరించిన వారితో కలెక్టర్ శ్రీహర్ష మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశమై వారికి పలు సూచనలిచ్చారు. గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు నియమితులైన జీపీవోలు తమ పరిధికి లోబడి నిజాయతీగా పనిచేయాలన్నారు. అధికారుల పనితీరును ప్రజలు నిశితంగా గమనిస్తారని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే పనులన్నీ ఆన్‌లైన్‌లో నమోదు అవుతున్నాయని కలెక్టర్ తెలిపారు. కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాలని, ప్రతీ రిపోర్ట్‌ను ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు. ప్రభుత్వంలో రెవెన్యూ శాఖ కీలకమైందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాలని, సర్టిఫికెట్ల జారీలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఆర్డీవోలు గంగయ్య, సురేశ్, ఏవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గోద్ ఫౌండేషన్ బ్రాండ్ అంబాసిడర్‌గా రష్మీ ఠాకూర్



రష్మీ ఠాకూర్

జ్యోతినగర్(రామగుండం): గోద్ ఫౌండేషన్ జాతీయ బ్రాండ్ అంబాసిడర్‌గా మిస్ ప్లానెట్ ఇండియా రష్మీ ఠాకూర్‌ను నియమించారు. ఈమేరకు ఫౌండేషన్ చైర్‌పర్సన్, రాజ్యసభ సభ్యురాలు మమతా మోహంతా, వైస్ చైర్మన్ నిజామొద్దీన్ మంగళవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఎన్టీపీసీ ప్రాంతానికి చెందిన రష్మీ ఠాకూర్ సేవా, సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భ్రూణహత్యల నివారణ, ఆడపిల్లల సంరక్షణపై అవగాహన పెంచడమే ఫౌండేషన్ లక్ష్యమన్నారు. చట్టాలను బలోపేతం చేయడం, మహిళా చట్టాల అమలుకు కృషి చేయడం, ఉల్లంఘించిన వారికి కఠిన శిక్షలు పడేలా అవగాహన కల్పించడం తన బాధ్యతని రష్మీ ఠాకూర్ వివరించారు.

దేశ నిర్మాణంలో ఇంజినీర్లపాత్ర అద్వితీయం

- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా



జ్యోతిప్రజ్వలన చేస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా, ఈడీ చందన్ కుమార్ సామంత తదితరులు

జ్యోతినగర్(రామగుండం): దేశ నిర్మాణంలో ఇంజినీర్లపాత్ర అద్వితీయమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. ఇంజినీర్స్ డే సందర్భంగా ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్‌లోని కాకతీయ ఆడిటోరియంలో ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఎన్టీపీసీ ఎగిక్యూటివ్ డైరెక్టర్ చందన్ కుమార్ సామంతతో కలిసి సీపీ జ్యోతి ప్రజ్వలన చేశారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేశారు. సీపీ మాట్లాడుతూ, ఎన్టీపీసీ వెలుగులు అందించడంలో దేశంలో అగ్రభాగాన నిలిచిందన్నారు. నూతన సాంకేతిక విధానాలతో విద్యుత్ ఉత్పత్తిని చేపట్టేందుకు ఇంజినీర్లు చేస్తున్న కృషి అమోఘమని అన్నారు. సీపీని ఎన్టీపీసీ ఈడీ చందన్‌కుమార్ సామంత శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ ప్రతినిధులు నితీశ్‌కుమార్, మహేంద్రకుమార్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను తరిమేద్దాం

- యువత డ్రగ్స్‌కు బానిసలు కావొద్దు
- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



ర్యాలీలో ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో మత్తు పదార్థాల నివారణపై అవగాహ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో ఎమ్మెల్యే విజయరమణారావు ర్యాలీని ప్రారంభించారు. అమర్‌నగర్, మేన్‌రోడ్డు, జెండా, సుభాష్‌నగర్ మీదుగా ర్యాలీ సాగింది. అనంతరం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంకూరి అవినాష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. యువత తమ భవిష్యత్‌ను బంగారుమయం చేసుకోవాలన్నారు. మత్తు పదార్థాలను అంటగట్టి బానిసలు చేసేందుకు పన్నే కుట్రలో బందీ కావొద్దని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలను ఉక్కుపాదంతో అణచివేసేందుకు ఈగల్ నినాదంతో ముందుకు సాగుతోందని తెలిపారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే నష్టాలపై అందరికీ అర్థమయ్యేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ కరుణాకర్, ఏసీపీ కృష్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ స్వరూప, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్, నాయకులు జడల సురేందర్, కొట్టె సదానందం, మస్రత్, ముత్యాల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్లు రాలేదని..

• టవర్ ఎక్కిన అడవిశ్రీరాంపూర్ మహిళలు


టవర్‌పై నిరసన తెలుపుతున్న మహిళలు

మంథని: ముత్తారం మండలం అడవిశ్రీ రాంపూర్‌లో ఇంది రమ్మ ఇళ్ల మంజూ రులో అవకతవకలు జరిగాయని మంగళ వారం మహిళలు, గ్రామస్తులు వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపారు. ప్రజాపా లనలో దరఖాస్తు చేసుకున్న తమకు తొలిజాబితాలో ఉన్న పేర్లను తొలిగించి ఇతరులకు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీలో తమపేర్లు మాయం కావడంతో కలెక్టర్, స్థానిక అధికారుల చుట్టూ తిరిగినా సమాధానం రాలేదన్నారు. దీంతోనే తాము నిరసనకు దిగామని బాధితులు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు తమపేర్లను తొలిగించి అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితి చక్కదిద్దడంతో బాధితులు టవర్ దిగారు.

బార్, రెస్టారెంట్లలో తనిఖీలు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరంలోని పలు బార్ అండ్ రెస్టారెంట్లలో పారిశుద్ధ్య విభాగం అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. నిషేధిత సింగిల్ యూస్ ప్లాస్టిక్ ఉపయోగించడం, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడాన్ని గుర్తించి జరిమానా విధించారు. మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీ ఆదేశాల మేరకు తనిఖీలు చేశారు. నిషేధిత ప్లాస్టిక్ గ్లాసులు ఉపయోగిస్తున్న తిరుమల బార్, రెస్టారెంట్, రామాంజనేయ బార్, రెస్టారెంట్లకు రూ.5వేలు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడేసిన నాగులమ్మ బార్, రెస్టారెంట్‌కు రూ.2వేల చొప్పున జరిమానా విధించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సంపత్, నాగభూషణం, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ మధుకర్, జవాన్లు అశోక్ సంపత్, సోమేశ్, దయానంద్ పాల్గొన్నారు.

ఇంటిపై పిడుగు.. పిల్లర్ ధ్వంసం

ధర్మపురి: ఇంటిపై పిడుగు పడడంతో డాబాపై ఉన్న పిల్లర్ ధ్వంసమైంది. ఇంట్లో ఉన్నవారికి ప్రాణాపాయం తప్పింది. నక్కలపేటలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఈక్రమంలో వడ్లూరి సత్యం ఇంటిపై పిడుగు పడింది. భారీ శబ్దం రావడంతో ఇంట్లోనివారు పైకి వెళ్లి చూశారు. పిల్లర్ ముక్కలై కనిపించింది. ఇంట్లో ఐదురుగురు ఉండగా.. ప్రాణాపాయం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు. లంబాడీతండాలోని ఓ మైదానంలోనూ పిడుగు పడింది.

వాగులో కొట్టుకుపోయి... ఈదుకుంటూ ఒడ్డుకు

శంకరపట్నం: అర్కండ్ల వాగులో ఓ వ్యక్తి మంగళవారం కొట్టుకుపోయి ఈదుకుంటూ ఒడ్డుకు చేరాడు. అర్కండ్ల వాగు లోలెవల్ బ్రిడ్జిపై నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండగా వీణవంక మండలం నుంచి వస్తున్న ఓ వ్యక్తి బ్రిడ్జిపై నుంచి వెళ్తుండగా వరద ప్రవాహంలో కొంతదూరం కొట్టుకుపోయా డు. అనంతరం ఈదుకుంటూ ఒడ్డుకు చేరాడు. ఆ వ్యక్తిని పలకరించినా మాట్లాడకుండా వీణవంక మండలం చల్లూరు వైపు వెళ్లాడని తెలిపారు.

తలవంచిన నిరంకుశత్వం

పోలీసులు, దొరలు, భూస్వాములు, రజాకార్ల దౌర్జన్యాలను సహించలేని అణగారిన. పీడిత ప్రజలు ఉద్యమించిన రోజు.. గ్రామాల్లోని ప్రజలు ఎక్కడికక్కడ పలుగు, పార, కారం, రోకలిబండలు, వరిసెలు, బరిసెలు.. ఇలా అందిందల్లా ఆడ, మగ తేడా లేకుండా అందరికీ ఆయుధాలుగా మారాయి. అనేకమంది యోధుల త్యాగాల ఫలితమే సెప్టెంబర్ 17..




మానాల క్యాంపులో సాయుధులు (ఫైల్)


నిజాం సంస్థాన పరిధి

మానాల క్యాంపుతో..

అప్పట్లో నిజామాబాద్ జిల్లా భీంగల్ (కస్బ) తాలూకా మానాల అడవుల్లో సాయుధ శిక్షణ శిబిరం(క్యాంపు) ఏర్పాటు చేశారు. గెరిల్లా దళాలకు శిక్షణ ఇస్తూ పోరాటానికి బాటలు వేశారు. మానాలలో అప్పట్లోనే వర్షాధార పంటలు పండడంతో గంజి, గట్కకు ఢోకా లేకపోవడంతో సాయుధ శిక్షణ ఇచ్చారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు నల్గొండ నుంచి ఔరంగాబాద్ దాకా.. ఆదిలాబాద్ నుంచి రాయచూర్ వరకు ఉద్యమంలో భాగస్వాములు కావడం విశేషం.

గెరిల్లా పోరుకు శ్రీకారం

1948 మార్చి 12న ఇల్లంతకుంట పోలీసు క్యాంపుపై సాయుధ ఉద్యమకారులు దాడి చేసి ఎస్సైతో సహా ఆరుగురు పోలీసులను హతమార్చారు. ఈ ఘటన అప్పటి సాయుధ దళనేత అనభేరి ప్రభాకర్ రావు నాయకత్వంలో జరిగింది. 1948 మార్చి 14న ప్రభాకర్‌రావు దళం హుస్నాబాద్ మండలం మహ్మదాపురం గుట్టల వద్ద ఆశ్రయం పొందగా పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు.

పోరాట యోధుడు అమృత్‌లాల్


అమృత్‌లాల్ శుక్లా(ఫైల్)

నిజాంను ఎదిరించిన వారిలో సిరిసిల్ల ప్రాంతానికి చెందిన అమృత్‌లాల్ శుక్లా ప్రముఖుడు. 1950లో సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌పై దాడి చేసి సంచలనం సృష్టించిన వీరుడు. సాయుధ దళాలను వ్యూహాత్మకంగా నడిపిస్తూ మూడు రంగుల జాతీయ జెండాలను ప్రాబల్య గ్రామాల్లో ఎగుర వేసి దేశభక్తిని చాటుకున్నారు. శుక్లాను నిజాం పోలీసులు నిర్బంధించి 13 ఏళ్ల జైలు శిక్ష విధించగా.. చంచల్‌గూడ జైలు నుంచి తరలిస్తుండగా పోలీసుల కళ్లుగప్పి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో తప్పించుకున్నాడు. 1957లో సిరిసిల్ల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 85 ఏళ్ల వయస్సులో 1991 నవంబర్ 14న అస్తమించారు.

మానాల కేంద్రంగా గెరిల్లా పోరాటం

సిరిసిల్ల: తెలంగాణ విముక్తి ఉద్యమం చురుగ్గా సాగుతున్న దశలో 1935 డిసెంబర్‌లో సిరిసిల్లలో నాల్గో ఆంధ్ర మహాసభ మాడపాటి హన్మంతరావు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో తీసుకున్న కీలక నిర్ణయాలతో విముక్తి పోరాటం ఉవ్వెత్తున ఎగిసింది. సురవరం ప్రతాపరెడ్డి, రావి నారాయణరెడ్డి, బూరుగుల రామకృష్ణారావు, పీవీ నర్సింహారావు, బద్దం ఎల్లారెడ్డి, కె.వి.రంగారెడ్డి లాంటి వారితో జిల్లాలోని పలువురు నాయకులు ఈ సభలో పాల్గొన్నారు. గాలిపెల్లికి చెందిన బద్దం ఎల్లారెడ్డి తెలంగాణ విముక్తి ఉద్యమంలో ప్రధానంగా ముందున్నారు.

పోరాటకెరటం 'చెన్నమనేని'


రాజేశ్వర్‌రావు (ఫైల్)

సాహసోపేత ఉద్యమంలో సిరి సిల్ల మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రాజేశ్వర్‌రావు పోరాట కెరటమయ్యారు. కోనరావుపేట మండలం నాగారంకు చెందిన రాజేశ్వర్‌రావు 1948 నుంచి 1951 వరకు భార్య లలితతో కలిసి అజ్ఞాతంలోకి వెళ్లి ప్రజా ఉద్యమాన్ని నిర్మించారు. నిజాం నిరంకుశత్వాన్ని ఎదిరించి జైలుశిక్ష అనుభవించారు. 957, 1967, 1978, 1985, 1994, 2004లో శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు.

ఎందరో త్యాగమూర్తులు


రాజలింగం, కోనరావుపేట)

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఎందరో త్యాగమూర్తులు నిజాం వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నారు. చందుర్తి మండలం బండపల్లికి చెందిన గడ్డం తిరుపతిరెడ్డి, వేములవాడకు చెందిన గుమ్మి పుల్లయ్య, కోనరావుపేటకు చెందిన రాజలింగం, నిమ్మపల్లికి చెందిన అనుముల నర్సయ్య, మల్కపేటకు చెందిన కర్రోళ్ల నర్సయ్య, సిరిసిల్లకు చెందిన గర్దాస్ గంగారాం వీరోచిత పోరాటాన్ని సాగించి విజయాన్ని సాధించారు.

రక్తసిందూరం గాలిపెల్లి


గాలిపెల్లిలో బద్దం ఎల్లారెడ్డి విగ్రహం

సిరిసిల్ల/ఇల్లంతకుంట: రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గాలిపెల్లి తెలంగాణ సాయుధ పోరాటంలో వీరోచిత పోరాట చరిత్రకు చిహ్నమైంది. నిజాం రాజ్యహింసకు ఒకేరోజు 11 మంది ప్రాణాలర్పించిన ఆ నేల రక్త సింధూరమైంది. కమ్యూనిస్టు యోధుడు బద్దం ఎల్లారెడ్డి నిజాం వ్యతిరేక పోరాటాన్ని సాగించారు. ఈ నేపథ్యంతో ఉద్యమకారులు గాలిపెల్లిలో జాతీయ జెండా ఎగురవేశారు. స్వాతంత్ర్య పోరాటాన్ని ఉధృతం చేస్తూ ఉద్యమించారు. ఇది జీర్ణించుకోలేని నిజాం పోలీసులు ఉద్యమకారులపై ఉక్కుపాదం మోపారు. రజాకార్లకు వ్యతిరేకంగా పల్లెలు తిరగబడ్డాయి. పోలీసులు, రజాకార్లపై తిరగబడిన గాలిపెల్లిలో భీకర పోరు సాగింది. ఆ పోరులో గాలిపెల్లికి చెందిన పీసు బక్కయ్య, బద్దం నారాయణ, బుర్రయ్య, పుల్లుగారి ఎల్లయ్య, అల్లెం వెంకయ్య, తాళ్లపల్లికి చెందిన సింగిరెడ్డి రాజిరెడ్డి, నర్సక్కపేటకు చెందిన ఎలేటి రాజిరెడ్డి, సోమారంపేటకు చెందిన ఐరెడ్డి భూంరెడ్డి, బెజ్జంకి మండలం బేగంపేటకు చెందిన తుమ్మోజి నారాయణ అసువులు బాశారు. ఉద్యమంతో సంబంధం లేనిగాలిపెల్లికి చెందిన పెరంబుదూరి అనంతయ్య, రంగమ్మ వృద్ధ దంపతులు బలయ్యారు. గ్రామ సమీపంలోని మొక్కజొన్న చేనులో భయంతో తలదాచుకున్న వీరిని రజాకార్లు కాల్చిచంపారు. రజాకార్ల దాడిలో బద్దం ఎల్లారెడ్డి, రాజలింగం, అమృత్‌లాల్ శుక్లా చాకచక్యంగా తప్పించుకున్నారు. వీరు తప్పించుకున్నారని తెలిసి ఆగ్రహంతో రజాకార్లు గాలిపెల్లి తగులబెట్టారు.

స్ఫూర్తి ప్రదాత బద్దం ఎల్లారెడ్డి


ఎల్లారెడ్డి(ఫైల్)

గాలిపెల్లికి చెందిన బద్దం హన్మంతరెడ్డి–లచ్చవ్వ రెండో సంతానంగా 1906లో జన్మించిన బద్దం ఎల్లారెడ్డి యుక్త వయసులోనే కమ్యూనిజం భావజాలాన్ని ఒంటబట్టించుకున్నారు. గెరిల్లా దళాలకు మానాల క్యాంపులో శిక్షణ ఇస్తూ.. పోరాటానికి బాటలు వేశారు. 1948 మార్చి 12న ఇల్లంతకుంట పోలీసు క్యాంపుపై సాయుధ ఉద్యమకారులు దాడి చేసి ఎస్సైతో సహా ఆరుగురు పోలీసులను హతమార్చారు. శ్రమదోపిడీకి వ్యతిరేకంగా సాగిన పోరాటంలో ఎల్లారెడ్డి ముఖ్యభూమిక పోషించారు. గాలిపెల్లిలో తన సొంత భూములను పేదలకు పంచడంతో పాటు సిరిసిల్ల ప్రాంతాల్లో దున్నే వాడిదే భూమి అంటూ ఉద్యమాన్ని రగిలించారు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా మద్రాసులో అరెస్ట్ అయి 3 నెలల జైలుశిక్ష అనుభవించారు. జైలు నుంచి వచ్చి కరీంనగర్ జిల్లాలో సాయుధ పోరాటాన్ని సాగించారు. 1951లో జరిగిన తొలి ఎన్నికల్లోనే పీడీఎఫ్ అభ్యర్థిగా కరీంనగర్ పార్లమెంట్ స్థానం నుంచి ప్రత్యర్థి పీవీ నర్సింహరావుపై విజయం సాధించారు. 1956లో భారత కమ్యూనిస్ట్ పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా పని చేశారు. 1958లో బుగ్గారం నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. రెండోసారి 1972లో ఇందుర్తి నుంచి ఎమ్మెల్యేగా ఎంపికై నిజాయితీ గల నేతగా ప్రజల్లో పేరు తెచ్చుకున్నారు. బస్సులోనే ప్రయాణిస్తూ సామాన్యులతో కలిసిపోయేవారు. బద్దం ఎల్లారెడ్డి స్ఫూర్తిగా సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీవై నగర్ పేరుతో కార్మిక క్షేత్రం, కరీంనగర్‌లో ఎల్లారెడ్డి భవన్ ఉంది. 1979లో తుది శ్వాస విడిచారు. ఆయనకు ఇద్దరు కొడుకులు రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, కూతురు విజయ ఉన్నారు.


నిజాంపై సాదుల నంబయ్య పోరు


సాదుల నంబయ్య, పెద్దపల్లి (ఫైల్)

పెద్దపల్లిరూరల్: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పెద్దపల్లి ప్రాంతంలో సాగిన పోరాటంలో అనభేరి ప్రభాకర్‌రావు, గట్టెపల్లి మురళి లాంటి వారితో పట్టణంలోని జ్యోతినగర్‌కు చెందిన సాదుల నంబయ్య (బుక్క నంబయ్య) చురుకుగా పాల్గొన్నారు. నిజాం రాజులకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేయడంలో పోరాటపటిమ చూపిన నంబయ్యపై ఆనాటి పాలకులు నజర్‌బంద్ కూడా ప్రకటించారు. అయినా ధైర్యంగా దేశభక్తిని పెంచేలా నాటకాలు, పాటలతో ప్రజలను చైతన్యవంతులను చేశారు. నిజాం పాలకులకు కొరకరాని కొయ్యగా మారారు. రజాకర్ల నుంచి ప్రజలకు ఇబ్బందులు రాకుండా గ్రామరక్షక దళాలు ఏర్పాటు చే సి వాటిని పర్యవేక్షించారు. ని జాం పాలకుల చెరలో ఉన్న భూములను పేదలకు పంచడంలో క్రియాశీలపాత్ర పోషించిన నంబయ్య.. తాను నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతాలకు తుది శ్వాస వరకు కట్టుబడి నిజాయతీ ఉన్న నంబయ్య ఈ ప్రాంత వాసులకు జ్ఞప్తికి తెచ్చుకుంటారు.

సాయుధ పోరులో 'జోగినిపల్లి' యోధులు


కేశవరావు (ఫైల్)



ఆనందరావు (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): తెలంగాణ సాయుధ పోరులో కొదురుపాక గ్రామానికి చెందిన జోగినిపల్లి కేశవరావు, మాన్వాడ గ్రామానికి చెందిన జోగినిపల్లి ఆనందరావు అలుపెరుగని పోరాటాలు చేశారు. 1920లో జన్మించిన కేశవరావు వ్యవసాయంతో పాటు సోషల్ వర్క్ చేసేవారు. 1940లో మహారాష్ట్ర చాందా, నాగ్‌పూర్ నుంచి ఆయుధాలు సేకరించి ఇక్కడ సాయుద దళాలకు అందించేవారని పూర్వికులు చెబుతారు. మూడుసార్లు పట్టుబడి వరంగల్ జైలుజీవితం గడిపారు. కేశవరావుకు భార్య లక్ష్మీకాంతమ్మ, కుమారుడు శ్రీనివాసరావు, కూతుర్లు శోభమ్మ, శశికళ, స్వర్ణలత ఉన్నారు. పెద్ద కుమార్తె శోభమ్మతో మాజీ సీఎం కేసీఆర్ వివాహం జరిగింది. 2000 సంవత్సరంలో కేశవరావు కాలం చేశారు.

ఆనందరావు స్మారక స్తూపం

మాన్వాడకు చెందిన ఆనందరావు 1921లో జన్మించారు. బీఏ, ఎల్ఎల్‌బీ చేశారు. చెన్నమనేని రాజేశ్వరరావుకు మేనమామ అయిన ఆనందరావు సిరిసిల్ల ప్రాంతంలో జరిగిన సాయుధ పోరులో కీలక పాత్ర పోశించారు. 1952–1957 వరకు సిరిసిల్ల ఎమ్మెల్యేగా, 1957–1962 వరకు మెట్‌పల్లి ఎమ్మెల్యేగా పని చేశారు. 2009లో ఆయన కాలం చేశారు. ఆనందరావు పోరాటాలకు గుర్తింపుగా మాన్వాడలో 2015లో స్మారక స్తూపం ఏర్పాటు చేశారు.

సమరయోధుల పోరాట గుర్తు


సమరయోధుల చిహ్నం

మంథనిరూరల్: స్వాతంత్ర్య సమరయోధుల సార్మకంగా మంథని మండలం గుంజపడుగులో సుమారు 50 ఏళ్ల చిహ్నం ఏర్పాటు చేశారు. నాడు పోరాటం చేసిన మంథనికి చెందిన లోకే లక్ష్మణశర్మ, రఘునాథకాచే, పి.గణపతిరావు, అవధానుల కిష్టయ్య, రాజన్న అవధాని, విశ్వనాథ్‌రావు, ఎం.గణపతి పేర్లను ఈ చిహ్నంపై చెక్కించారు. నాటి నుంచి నేటి వరకు సెప్టెంబర్17న ఈ చిహ్నం వద్ద సమరయోధులను స్మరించుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

కదనరంగంలో కరీంనగర్..


అనభేరి ప్రభాకర్ రావు (ఫైల్)

కరీంనగర్: నిజాం పాలన అంతం కోసం తొలిదళాన్ని ఏర్పాటు చేసి సాయుధ పోరులో హతమైన తొలి దళ నాయకుడు అనభేరి ప్రభాకర్‌రావు తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామానికి చెందిన వారు. అలాగే చెన్నమనేని రాజేశ్వర్‌రావు, గట్టెపల్లి మురళీధర్‌రావు, చామనపల్లి చొక్కారావు, ఖాసీంపేట వెంకట్‌రెడ్డి, బొజ్జపురి వెంకటయ్య, వేముల నర్సింహులు, గాంభీరపు రామయ్య లాంటి ఎందరో అరాచక పాలనకు ఎదురుతిరిగారు.

రణభేరి మోగించిన 'అనభేరి'

జమీందారి కుటుంబంలో జన్మించిన అనభేరి ప్రభాకర్‌రావు తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి దళ నాయకునిగా తుపాకి పట్టి పేదలకు బాసటగా నిలిచారు. 1910 ఆగస్టు 15న తిమ్మాపూర్ మండలం పొలంపెల్లి గ్రామంలో జన్మించారు. ప్రాథమిక విద్యను మచిలీపట్నం, ఉన్నత విద్యను హైదరాబాద్‌లో అభ్యసించారు. తెలంగాణ విముక్తి కోసం జీవితాన్ని త్యాగం చేసిన తొలి సాయుధ దళ నాయకునిగా చరిత్రకెక్కారు. 1948 మార్చి 14న ప్రభాకర్ సాయుధ దళాన్ని హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ పోలీస్ పటేల్ భోజనానికి పిలిచి ఆ సమాచారాన్ని నిజాం ప్రభుత్వానికి తెలియజేశారు. దీంతో మహ్మదాపూర్ గుట్టలను మిలటరీ, రజాకార్లు చుట్టుముట్టారు. వారి తూటాలకు ఎదురొడ్డి పోరాడి 'అనభేరి'తో పాటు, సింగిరెడ్డి భూపతిరెడ్డి, ముస్కు చొక్కారెడ్డి, ఏలేటి మల్లారెడ్డి, అయిరెడ్డి భూంరెడ్డి, తూమేజు నారాయణ, బి.దామోదర్‌రెడ్డి, ఇల్లందుల పాపయ్య, పోరెడ్డి రాంరెడ్డి, నల్గొండ రాజారాం, చిక్కుడు సాయిలు, రోండ్ల మాధవరెడ్డి అమరులయ్యారు.


మహ్మదాపూర్ గుట్టల్లో అనభేరి దళం ఎన్‌కౌంటర్‌కు గురైన ప్రదేశం.

కొరియర్‌గా చిన్నమల్లయ్య


చినమల్లయ్య (ఫైల్)

తెలంగాణ సాయుధ పోరాటంలో కొరియర్‌గా పాల్గొన్న దేశిని చిన్నమల్లయ్య మలి విడత తెలంగాణ ఉద్యమంలోనూ క్రియాశీలంగా వ్యవహరించారు. 1948 ఫిబ్రవరిలో అనభేరి ప్రభాకరరావును కలిసి ఆయన దళానికి కొరియర్‌గా పని చేశారు. తర్వాత ప్రజాజీవితంలో నాలుగుసార్లు సర్పంచ్‌గా, ఒకసారి సమితి ప్రెసిడెంట్‌గా, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టారు. నిర్వర్తించారు.

విద్యార్థిగా ఉద్యమంలో..

విద్యార్థి దశలోనే జువ్వాడి గౌతంరావు స్వాతంత్ర్య ఉద్యమంలో చేరారు. కరీంనగర్, వరంగల్ జైళ్లలో శిక్ష అనుభవించారు. 1947లో ఔరంగాబాద్ జైలు నుంచి తప్పించుకొని మళ్లీ ఉద్యమంలో పాల్గొన్నారు. బద్దం ఎల్లారెడ్డి లాంటి వీరుల మార్గదర్శకత్వంలో పనిచేశారు.


గౌతంరావు (ఫైల్)

అజ్ఞాత జీవితం తప్పలేదు


వెంకటరామరావు (ఫైల్)

బోయినిపల్లి వెంకటరామరావు 1947 అక్టోబర్ 2న అనేక గ్రామాల్లో గాంధీజయంతి వేడుకలు జరిపారు. జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనం కావాలని ప్రచారం చేశారు. నిజాం పోలీసులు, రజాకార్లు తోటపెల్లిలో ని ఆయన ఇంటి మీద దాడి చేసి ధ్వంసం చేశారు.

ఉద్యమకారులకు కొరియర్‌గా

జిల్లాకు చెందిన వెలిచాల కొండల్‌రావు హైదరాబాద్‌లో చదువుకుంటూనే విద్యార్థి కార్యకర్తగా సత్యాగ్రహంలో పాల్గొన్నారు. 15 ఏళ్ల వయసులో కోర్టు విచారణలో మెజిస్ట్రేట్‌కే ఎదురు తిరిగినందుకు 7 రోజుల జైలు శిక్ష గడపాల్సివచ్చింది. చదువుకుంటూనే నాయకులకు కొరియర్‌గా గా పని చేశారు.

పోలీస్ స్టేషన్‌పై దాడి చేసిన ధీశాలి..

మహదేవ్‌పూర్‌కు చెందిన ఎస్.శంకరయ్య 1947లో ఉద్యమానికి ఆకర్షితుడయ్యారు. అప్పట్లో సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు ఎస్సై గురుదయాళ్ సింగ్ వీరిని అరెస్ట్ చేశారు. మంథని వీధుల్లో లాఠీ దెబ్బలు కొడుతూ ఊరేగించారు. అనంతరం శంకరయ్య తప్పించుకుని చాందా క్యాంపులో చేరారు. తర్వాత మహదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌గా భావించి కాళేశ్వరం ఔట్‌పోస్ట్‌పై దాడి చేశారు.

కుటుంబ కలహాలతోనే గృహిణి హత్య

• నిందితుడి అరెస్ట్ • బైక్, కత్తి స్వాధీనం • డీసీపీ కరుణాకర్ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కరుణాకర్, ఏసీపీ రమేశ్

గోదావరిఖని: కుటుంబ కలహాలతోనే రామగిరి మండలం పన్నూర్ గ్రామపంచాయతీ పరిధి వకీల్‌పల్లి ప్లాట్స్‌లో ఆదివారం మేడి రమాదేవి హత్య జరిగిందని డీసీపీ కరుణాకర్, ఏసీపీ రమేశ్ తెలిపారు. గోదావరిఖని వన్‌టౌన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వారి కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రెడ్డికాలనీకి చెందిన మేడి రమాదేవి ఉరఫ్ పూసల ప్రశాంతి, జైపూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన పూసల కృపాకర్ ఉరఫ్ ప్రభాకర్ 13ఏళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరిద్దరూ పన్నూర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏడాదిగా వీరిద్దరి మధ్య కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. అప్పటినుంచి భార్యాభర్తలు వేర్వేరుగా ఉంటున్నారు. ఈక్రమంలో ఆదివారం తన భర్త ఇంటికి రమాదేవి చేరుకుంది. ఇద్దరి మధ్య మళ్లీ వాగ్వావాదం జరిగింది. నిత్యం జరిగే వివాదాల నేపథ్యంలో రమాదేవిని ఎలాగైనా చంపాలని నిర్ణయించి కృపాకర్.. కత్తితో తల, మెడ, కడుపులో దాడి చేశాడు. రక్తపు మడుగులో పడి ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. హత్య తర్వాత బైక్‌పై నిందితుడు పరారయ్యాడు. సాంకేతిక పరిజ్ఞానంతో మంగళవారం ఉదయం అద్నాపూర్ వద్ద నిందితుడిని పట్టుకున్నారు. హీరోహోండా బైక్, హత్యకు ఉపయోగించిన కత్తి స్వాధీనం చేసుకున్నారు. హత్య కేసులో మృతిరాలి అత్తామామలను త్వరలో అరెస్టు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో రామగిరి ఎస్సైలు శ్రీనివాస్, దివ్య పాల్గొన్నారు.

అండర్ 19 ఎస్జీఎఫ్ క్రీడా సంబురం

• రేపటి నుంచి నవంబర్ 7వరకు జరగనున్న పోటీలు
• షెడ్యుల్ విడుదల చేసిన డీఐఈవో, ఎస్జీఎఫ్ అండర్– 19 కార్యదర్శి



కరీంనగర్‌స్పోర్ట్స్: కళాశాలల క్రీడా సంబురం ఆరంభమైంది. ఇప్పటికే స్కూల్ గేమ్స్‌తో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా క్రీడా వాతావరణం నెలకొనగా గురువారం నుంచి అండర్ 19 సందడి మొదలు కానుంది. 2025–26 విద్యాసంవత్సరానికి కళాశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరుగనున్న పోటీలకు సంబంధించిన షెడ్యుల్‌ను మంగళవారం డీఐఈవో వి.గంగాధర్, అండర్ 19 కార్యదర్శి జి మధుజాన్సన్‌లు విడుదల చేశారు. గురువారం నుంచి నవంబర్ 7 వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోటీలను అట్టహాసంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలకు సంబంధించిన ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.


నేరుగా పోటీలు..

కళాశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరుగనున్న పోటీలను నేరుగా ఉమ్మడి జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి మధు జాన్సన్ తెలిపారు. ఉమ్మడి జిల్లా పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయిలో పాల్గొనే ఉమ్మడి కరీంనగర్ జట్టుకు ఎంపిక చేయనున్నామని అన్నారు.

పోటీలు నిర్వహించే వేదిక.. తేదీలు ఇలా..

ఈనెల 18న జగిత్యాల పొన్నాల గార్డెన్‌లో బాక్సింగ్, కరాటే, తైక్వాండో, తాంగ్‌తా (బాలబాలికలు), 19న కొత్తపల్లి అల్ఫోర్స్‌లో 19న చెస్, యోగా (బాలబాలికలు), 20న కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో ఫుట్‌బాల్ (బాలురు), అక్టోబర్ 6న కొత్తపల్లిలోని అల్ఫోర్స్ కాలేజీలో వుషూ, జూడో (బాలబాలికలు). 7న కొత్తపల్లి అల్ఫోర్స్‌లో కబడ్డీ (బాలురు), 8న చింతకుంట గురుకుల కళాశాలలో కబడ్డీ (బాలికలు), 9న తిమ్మాపూర్‌లోని శ్రీచైతన్య కళాశాలలో వాలీబాల్ (బాలురు).10న చింతకుంట గురుకుల కళాశాలలో వాలీబాల్ (బాలికలు). 13న కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్(బాలబాలికలు). 15న కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలో రెజ్లింగ్ (బాలబాలికలు). 16న కొత్తపల్లి అల్ఫోర్స్‌లో హ్యాండ్‌బాల్ (బాలబాలికలు). 17న జగిత్యాల మినీ స్టేడియంలో క్రికెట్(బాలబాలికలు), 18న కొత్తపల్లి అల్ఫోర్స్‌లో టేబుల్ టెన్నిస్ (బాలబాలికలు), 23న గోదావరిఖని జేఎన్ స్టేడియంలో స్కేటింగ్, వెయిట్ లిఫ్టింగ్(బాలబాలికలు).24న కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో ఖోఖో(బాలురు). 25న కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో ఖోఖో(బాలికలు). 26న కొత్తపల్లి తేజస్ కళాశాలలో బాస్కెట్‌బాల్ (బాలబాలికలు). 28న జగిత్యాల మినీ స్టేడియంలో ఫెన్సింగ్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ (బాలబాలికలు). 29న కొత్తపల్లి అల్ఫోర్స్‌లో స్విమ్మింగ్ (బాలబాలికలు). 31న కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో హాకీ (బాలబాలికలు). కరీంనగర్ శాతవాహన వర్సిటీలో నవంబర్ 4న సైక్లింగ్ (బాలబాలికలు). 6న కొత్తపల్లి తేజస్ కళాశాలలో ఆర్చరీ (బాలబాలికలు). 7న జగిత్యాల మినీ స్టేడియంలో రగ్బీ (బాలబాలికలు). 7న జగిత్యాల క్లబ్‌లో లాన్ టెన్నిస్, బ్యాడ్మింటన్, షూటింగ్ (బాలబాలికలు). 7న జగిత్యాల మినీ స్టేడియంలో ఫుట్‌బాల్ (బాలికలు).

పోటీలను ఘనంగా నిర్వహిస్తాం



ఉమ్మడి జిల్లా కళాశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరుగనున్న పోటీలను అందరి సహకారంతో ఘనంగా నిర్వహిస్తాం. క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేయాలి. ఎస్జీఎఫ్ నిబదనలు ప్రతిఒక్కరూ పాటించాలి. అండర్ 19 రాష్ట్ర పోటీల్లో కరీంనగర్ జట్టు చాంపియన్‌గా నిలువాలనే లక్ష్యంతో పోటీలను నిర్వహిస్తాం.

– జి.మధుజాన్సన్, అండర్ 19 ఉమ్మడి జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి

రూ.300 కోసమే మర్డర్

• ఆటో డ్రైవర్ హత్యకేసు ఛేదన
• ఇద్దరు బిహారీల అరెస్టు
• వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాలక్రైం: జగిత్యాలలో ఈనెల 14న జరిగిన ఆటో డ్రైవర్ హత్యకేసును పోలీసులు ఛేదించారు. ఆటో అద్దె రూ.300 చెల్లించే విషయంలో గొడవ జరగడంతో ఆటో డ్రైవర్‌ను హత్య చేసినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. జగిత్యాల రూరల్ సీఐ కార్యాలయంలో మంగళవారం వివరాలు వెల్లడించారు. జగిత్యాల పట్టణంలోని సుతారిపేటకు చెందిన ఆటో డ్రైవర్ నయిమోద్దీన్ ఈనెల 14న రాత్రి పాతబస్టాండ్‌లో ప్రయాణికుల కోసం ఎదురుచూస్తున్నాడు. బిహార్‌కు చెందిన దర్శన్‌సాహ్నీ, సునీల్ సాహ్నీ, పంకజ్‌కుమార్ ఆటో డ్రైవర్ నయిమోద్దీన్ వద్దకు వచ్చారు. వారు పనిచేసే జగిత్యాల రూరల్ మండలం హైదర్‌పల్లి శివారులోని రైస్‌మిల్లుకు తీసుకెళ్లాలని సూచించారు. రూ.300కు కిరాయి కుదుర్చుకున్నారు. పొలాస శివారుకు వెళ్లేసరికి ఆటోకిరాయి చెల్లింపు విషయంలో డ్రైవర్‌తో గొడవ జరిగింది. పంకజ్‌కుమార్ ఆటో దిగి వెళ్లిపోయాడు. దర్శన్‌సాహ్నీ, సునీల్ సాహ్నీ కలిసి గుడ్డపేలుకతో నయిమోద్దీన్ గొంతు బిగించి, కింద పడేశారు. సునిల్ సాహ్నీ బండరాయితో నయిమోద్దీన్ ముఖంపై బాదాడు. చనిపోయాడని నిర్ధారించుకుని, మృతదేహాన్ని పక్కనున్న నీటిలో పడేశారు. అక్కడినుంచి హైదర్‌పల్లి శివారులోని రైస్‌మిల్లుకు వెళ్లిపోయారు. మృతుడి సోదరుడు ఇసాక్‌ఖాన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు సీసీఫుటేజీల ఆధారంగా పంకజ్‌కుమార్‌ను విచారించగా జరిగిన విషయం చెప్పాడు. దీంతో హైదర్‌పల్లి రైస్‌మిల్లులో ఉన్న దర్శన్‌సాహ్నీ, సునీల్‌సాహ్నీను అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. రూరల్ సీఐ సుధాకర్, ఎస్సై సదాకర్, ఏఎస్సై అజీమోద్దీన్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

తాళంవేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చోరీలు

గోదావరిఖని: జల్సాలకు అలవాటు పడి కొద్దిరోజులుగా చోరీలకు పాల్పడుతున్న స్థానిక రమేశ్‌నగర్‌కు చెందిన కవ్వంపల్లి అరుణ్‌కుమార్(23)ను అరెస్ట్ చేసినట్లు పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ తెలిపారు. మంగళవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. డిగ్రీ చదువుతూ చెడు అలవాట్లకు బానిసగా మారిన అరుణ్‌కుమార్ దొంగతనాలకు దిగాడు. స్థానిక విఠల్‌నగర్ ప్రాంతంలో అర్ధరాత్రి సమయంలో తిరుగుతూ తాళం వేసిన ఇళ్లను గుర్తించి వెనుక డోర్ నుంచి లోపలికి వెళ్లి విలువైన వస్తువులు ఎత్తుకెళ్లాడు. చోరీ చేసిన ఆభరణాలను విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తూవస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు నిందితుని పట్టుకుని కూపీ లాగగా, మూడు చోరీలు వెలుగులోకి వచ్చాయి. ఈమేరకు నిందితుడిని అరెస్ట్‌చేశారు. మూడు చోరీ కేసుల్లో రూ.1.93లక్షల విలువైన 23.6 గ్రాముల బంగారం, 45తులాల వెండి స్వాధీనం చేసుకున్నారు. చోరీల వెనకాల ఇంకా ఎవరెవరైనా ఉన్నారా? అనే విషయంపై దర్యాప్తు కొనసాగుతోంది. కేసుల ఛేదనలో చురుకుగా వ్యవహరించిన ఎస్సై అనూష, క్రైంపార్టీ హెడ్ కానిస్టేబుళ్లు రమేశ్, సదానందం, కానిస్టేబుళ్లు మధూకర్, మధుసూదన్, రమేశ్‌కు డీసీపీ క్యాష్ రివార్డ్ అందజేసి అభినందించారు. డీసీపీ మాట్లాడుతూ, దసరా సెలవుల సందర్భంగా విహారయాత్రలు, దైవదర్శనాలు, ఊర్లకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.